ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -93 పేజీలు - 04 వెల - 04/- గురువారం 16 ఏప్రిల్ 2026

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు కూటమి సంపూర్ణ మద్దతు

## చంద్రబాబు నివాసంలో ముగిసిన ఎన్డీయే నేతల సమావేశం

**బిల్లుకు మద్దతుగా వైసీపీ సహా అన్ని పార్టీలను ఆహ్వానించాలని నిర్ణయం**

**ఈ నెల 17న అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేక కార్యక్రమం**

**జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కృతజ్ఞతా కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానం**




**అమరావతి:ఏప్రిల్ 15 ఆంధ్ర ప్రగతి**
మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు నిర్ణయించాయి. **మిగతా 2లో...**

## నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

**మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ**

**ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం**

**వాడీవేడీగా సాగనున్న సమావేశాలు**




**న్యూఢిల్లీ,ఏప్రిల్ 15 ఆంధ్ర ప్రగతి** పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదించారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. **మిగతా 2లో...**

## బాలికలదే పైచేయి

**ఇంటర్ ఫలితాలు విడుదల**

**కృష్ణా ఫస్ట్, అన్నమయ్య లాస్ట్**

**మే 21 నుంచి సప్లిమెంటరీ**

**ఫీజు గడువు ఏప్రిల్ 27 వరకు**



**అమరావతి:ఏప్రిల్ 15 ఆంధ్ర ప్రగతి**
ఇంటర్మీడియేట్ ఫలితాల్లో బాలికలు మరోసారి తమ సత్తా చాటారు. ఈ సారి కూడా బాలికలే హవానే కొనసాగింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాల్లో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. 2026 ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా బుధవారం విడుదల చేశారు. మొదటి సంవత్సరంలో 77శాతం, రెండవ సంవత్సరంలో 81శాతం ఉత్తీర్ణత నమోదయింది. 4,71,864 మంది తొలి ఏడాది పరీక్షలకు హాజరవ్వగా వీరిలో 3,61,526 మంది**మిగతా 2లో...**

## హార్ముజ్‌ను తెరుస్తున్నాం

**చైనా కోసండప్రపంచం కోసమే : ట్రంప్**

**ఇరాన్ యుద్ధం ముగియబోతోంది**

**రెండో విడత చర్చలకు దౌత్య యత్నాలు**

**వాషింగ్టన్‌లో ఇజ్రాయిల్, లెబనాన్ రాయబారుల భేటీ**



2లో.

## పేదల కడుపు నిండినప్పుడే నిజమైన అభివృద్ధి

**పల్లె ప్రజల కోసం 62 అన్న క్యాంటీన్లు ప్రారంభం...**

**పల్నాడు జిల్లా లో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

**రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 62 గ్రామీణ ప్రాంతాల్లో క్యాంటీన్ల ఏర్పాటు**

**పేదల ఆకలి తీరినప్పుడే అది నిజమైన అభివృద్ధి అని వ్యాఖ్య**

**గత ప్రభుత్వం అన్నదానాన్ని అడ్డుకుందని తీవ్ర విమర్శలు**

**రాష్ట్రంలో 269కి చేరిన అన్న క్యాంటీన్ల మొత్తం సంఖ్య**

2లో.



## మత్స్యకారుల హక్కుల్ని చంద్రబాబు తాత కూడా తీసుకోలేరు: జగన్



**కళ్లు మూసి తెరిచేలోగా మళ్లీ మన ప్రభుత్వమన్న జగన్**

**జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమేసే కుట్ర జరుగుతోందని ఆరోపణ**

**తమ హయాంలో రూ.26 వేల కోట్లతో పోర్టులు, హార్బర్లు నిర్మించామని వెల్లడి**

**అధికారంలోకి రాగానే మత్స్యకారుల హక్కులు కాపాడతామని హామీ**

**అమరావతి:ఏప్రిల్ 15 ఆంధ్ర ప్రగతి**
మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ఏపీలోని కూటమి ప్రభుత్వంపై, సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం పాలన అన్యాయంగా సాగుతోందని, దేవుడు అన్నీ చూస్తున్నాడని వ్యాఖ్యానించారు. కళ్లు మూసుకుని తెరిచేలోపు మళ్లీ మన ప్రభుత్వం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. **మిగతా 2లో...**

# టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లోకేశ్

**పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా కొనసాగింపు**

**ఇద్దరు క్షేత్రస్థాయి నేతలకు పోలిట్ బ్యూరోలో స్థానం**

**పార్టీ కార్యవర్గాన్ని పునర్నిర్మించిన చంద్రబాబు**

**అమరావతి:ఏప్రిల్ 15 ఆంధ్ర ప్రగతి**
టిడిపి కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మంత్రి నారా లోకేశ్‌ను ప్రకటించింది. పార్టీకి ఇప్పటి వరకు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న లోకేశ్ఓ రకంగా ప్రమోషన్ పొందారు. మెల్లగా ఆయన చంద్రబాబుకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నారు. ఇప్పటికే పార్టీలో అంతా తానై నడిపిస్తున్నారు. ఇకపోతే తెదేపా ఏపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ కొనసాగనున్నారు. పొలిటిబ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ఈ మేరకు పార్టీ ప్రకటించింది. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శులుగా రామ్మోహన్ నాయుడు, బైరెడ్డి శబరి, రాజేశ్ కిలార్‌లను పార్టీ నియమించింది. సీనియర్లకు గౌరవమిస్తూ.. కొత్తవారికి అవకాశాలు కల్పిస్తూ.. సామాజిక కోణంలో నూతన కమిటీల కూర్పు జరిగింది. విధేయత, కష్టపడే తత్వం, అనుభవం లెక్కించి అధిష్ఠానం పదవులు ఇచ్చింది. నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు రాని వారికి పార్టీ పదవుల ద్వారా న్యాయం కల్పించింది. అన్ని సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పుపై పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కసరత్తు చేశారు. **మిగతా 2లో...**



## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు...

**ఐదుగురి మృతి... 12 మంది పరిస్థితి విషమం**



**సత్యసాయి జిల్లా కదిరిలో భారీ పేలుడు -డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఘటన**

**ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి -20 మందికి తీవ్ర గాయాలు**

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సత్యకుమార్ ఆదేశం**

**కదిరి ఏప్రిల్ 15 ఆంధ్ర ప్రగతి**
శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. కదిరి మండలంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఐదుగురు మృతి చెందారు. ఈ ఘోర ప్రమాదంలో మరో 20 మంది గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది. వివరాల్లోకి వెళితే, కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ కూలీ ఇంట్లో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు**మిగతా 2లో...**

## 'డీలిమిటేషన్'ను వ్యతిరేకిస్తాం

**మహిళా రిజర్వేషన్‌కు ఓకే**

**ఇండియా వేదిక నిర్ణయం**

**న్యూఢిల్లీఏప్రిల్ 15 ఆంధ్ర ప్రగతి**
కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకువస్తున్న డీ లిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లును వ్యతిరేకించాలని ఇండియా వేదిక పార్టీలు నిర్ణయించాయి. రాజ్యసభలో**మిగతా 2లో...**



## బీహార్ ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి ప్రమాణం

**పాట్నా ఏప్రిల్ 15 ఆంధ్ర ప్రగతి** బీహార్ నూతన ముఖ్యమంత్రిగా బిజెపి నాయకులు సామ్రాట్ చౌదరి బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. పాట్నాలోని లోక్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సామ్రాట్ చౌదరి చేత గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ప్రమాణస్వీకారం చేయించారు. అలాగే, జెడి(యు) సీనియర్ నాయకులు బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్ కుమార్ చౌదరీ కూడా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. బహుశా ఈ ఇద్దరు నాయకులు ఉపముఖ్యమంత్రులుగా వ్యవహరిస్తారని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్య మంత్రి నితీష్‌కుమార్‌తో పాటు బిజెపి జాతీయ అధ్యక్షులు నితీన్ నబిన్, కేంద్ర మంత్రులు జెపి నడ్డా, బిజెపి, జెడి(యు) నాయకులు పాల్గొన్నారు.



# బాలికలదే పైచేయి

**మొదటిపేజీ తరువాయి**

మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 4,46,537 మంది విద్యార్థులు హాజరు కాగా 3,59,816 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో బాలికలు 81శాతం, బాలురు 72శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో బాలికలు 85శాతం, బాలురు 76శాతం ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో బాలుర కంటే బాలికలు 4శాతం అదనంగా ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 90శాతంతో ద్వితీయ సంవత్సరంలో 92శాతంతోనూ కృష్ణా జిల్లా మొదటి స్థానంలో నిలవగా, అన్నమయ్య జిల్లా ప్రథమ సంవత్సరంలో 62శాతం, ద్వితీయ సంవత్సరంలో 67శాతం సాధించి చివరి స్థానంలో నిలిచింది. గ్రూపుల వారీగా ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఎంపిసిలో 77 శాతం, బైపిసి విద్యార్థులు 72, సిఇసి 50, హెచ్ఇసి 45, ఎంఇసి 88శాతం చొప్పున ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపిసి, బైపిసి 83శాతం, సిఇసి 63శాతం, హెచ్ఇసి 62శాతం, ఎంఇసి 81శాతం చొప్పున ఉత్తీర్ణులయ్యారు.

ఒకేషనల్ లో..!

ఒకేషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 61శాతం ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో 74శాతం సాధించారు. ప్రథమ సంవత్సరంలో బాలికలు 71శాతం, బాలురు 49శాతం ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో బాలికలు 83శాతం, బాలురు 62శాతం సాధించారు.

సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల హవా

ఇంటర్ ఫలితాల్లో సంక్షేమ హాస్టళ్లు విద్యార్థులు హవా సాధించారు. అందరి కంటే బిసి సంక్షేమ హాస్టళ్లల్లో చదువుతున్న ప్రథమ సంవత్సరంలో 97శాతం, ద్వితీయ సంవత్సరంలో 94శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎపిఆర్‌జెసి విద్యార్థులు తొలి సంవత్స రంలో 92శాతం, ద్వితీయ సంవత్సరంలో 95శాతం సాధించారు. గిరిజన సంక్షేమ హాస్టళ్లల్లో చదువుతున్న ప్రథమ సంవత్సరం విద్యార్థులు 90శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 93శాతం సాధించారు. కెజిబివి తొలి సంవత్సరం విద్యార్థులు 84శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 87శాతం ఉత్తీర్ణుల య్యారు. సంక్షేమ హాస్టళ్లల్లో చదువుతున్న తొలి సంవత్సరం విద్యార్థులు 87శాతం, ద్వితీయ సంవ త్సరం విద్యార్థులు 94శాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్‌లో తొలి సంవత్సరం విద్యార్థులు 75శాతం సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 80శాతం ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 54, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 68శాతం, ఎయిడెడ్‌లో తొలి సంవత్సరం విద్యార్థులు 46శాతం, ద్వితీయ సంవత్సరం 64శాతం సాధించారు. హైస్కూల్ ప్లస్‌లో తొలి సంవత్సరం 45శాతం ఉత్తీర్ణత కాగా, ద్వితీయ సంవత్సరం 57శాతంగా నమోదైంది. ప్రైవేట్ జూనియర్ కళాశాలలు తొలి సంవత్సరంలో 80% మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో 82% మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

# నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి**

ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోడీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ నాలుగు డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. ఇప్పటి వరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉన్నాయి. అయితే ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందులో 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332, 334ఏలకు సవరణలు ప్రతిపాదించింది. రాజ్యాంగంలో గరిష్ఠంగా 550 లోక్‌సభ స్థానాలను పేర్కొన్నా ప్రస్తుతం 543 మాత్రమే ఉన్నాయి. అంటే.. గరిష్ఠ సంఖ్యలో 98.72 నియోజకవర్గాలే ఉన్నట్లు లెక్క. ఆ నిష్పత్తి ప్రకారం చూస్తే కేంద్ర ప్రభుత్వం కొత్త స్థానాల సంఖ్యను 840దాకా ఖరారుచేసే సూచనలున్నాయి. అయితే ఇదివరకు వివిధ పార్టీల నాయకులతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చర్చలు జరిపినప్పుడు.. మొత్తం స్థానాలను గంపగుత్తగా 50శాతం పెంచుతామని చెప్పారు. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడున్న 543 స్థానాలు 816కి చేరే అవకాశం ఉంటుంది. ఆర్టికల్ 81(3)లో 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని ఉంది. ఇప్పుడు దాన్ని సవరించి.. గతంలోని జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడానికి తాజా బిల్లును కేంద్రం ప్రతిపాదించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 అసెంబ్లీ స్థానాల పునర్విభజన, ఆర్టికల్ 170 అసెంబ్లీ స్థానాల గరిష్ఠ సంఖ్య గురించి చెబుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల ప్రకారం ఆర్టికల్ 82 కింద అసెంబ్లీ స్థానాలను పునర్విభజించాలంటే 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఆ నిబంధనను సవరించి ప్రతి జనాభా లెక్కల తర్వాత అసెంబ్లీ స్థానాలను పునర్విభజించడానికి అవకాశం కల్పించారు. ఆర్టికల్ 334ఏలో ఇదివరకు 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 (మహిళా రిజర్వేషన్ల చట్టం) ఆమోదం పొందిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ప్రాతిపదికన నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పుడు దాన్ని సవరించి డీలిమిటేషన్ పక్రియ పూర్తయిన వెంటనే ఇవి అమల్లోకి వస్తాయని స్పష్టత ఇచ్చారు. 84వ రాజ్యాంగ సవరణ చట్టం-2001లో ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332లను సవరించి 1971 జనాభా లెక్కల ప్రకారమే పార్లమెంటు, అసెంబ్లీల సీట్లను కేటాయించాలని పేర్కొన్నారు.

2026 తర్వాత తొలి జనాభా లెక్కలు చేపట్టేంతవరకూ వాటిని పునర్విభజించకూడదని షరతు విధించారు.

2003లో చేసిన 87వ రాజ్యాంగ సవరణ చట్టంలో ఆర్టికల్ 81, 82, 170, 330లను సవరించి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను పెంచకుండా 2001 జనాభా లెక్కల ప్రకారం ఆయా రాష్ట్రాల్లోని స్థానాలను పునర్విభజించు కోవడానికి అవకాశం కల్పించారు. దీని ప్రకారం 2008లో నియోజకవర్గాల పునర్విభజన చేయగా 2009 ఎన్నికల్లో అవి అమల్లోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పునర్విభజన కోసం సుప్రీంకోర్టు ప్రస్తుత/ మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుంది. బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కమిషన్ అమల్లోకి వస్తుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత/మాజీ న్యాయమూర్తిని కేంద్ర ప్రభుత్వం కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గానీ, ఆయన నామినీగానీ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉంటారు. అలాగే రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులవుతారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంటు, అసెంబ్లీలతోపాటు, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల పునర్విభజననూ చేపడుతుంది.

తాజా జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఎన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు ఉండాలన్నది ఈ కమిషన్ నిర్ణయిస్తుంది. అలాగే రాష్ట్రాలవారీగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను విభజిస్తుంది.

# నీటి భద్రత కోసం 'జలధార' యాక్షన్ ప్లాన్

## : సీఎం చంద్రబాబు ఆదేశాలు

**అమరావతి:ఏప్రిల్ 15 ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో నీటి భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరి జలాలను ఎలా వినియోగించుకోవాలో స్పష్టమైన 'జలధార యాక్షన్ ప్లాన్' సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుడి, ఎడమ కాలువలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువులను నింపేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా సహా పలు కీలక ప్రాజెక్టుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.పోలవరం ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, హోటళ్లు, షాపింగ్ ఏరియాలతో పాటు పోలవరం-పాపికొండలు-భద్రాచలం మార్గంలో బోటింగ్ సౌకర్యం కల్పించాలని సీఎం సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలన్నారు.



ప్రాజెక్టులో కీలకమైన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. పునరావాస పనులను వేగవంతం చేసి, నిర్వాసితుల తరలింపును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రాజెక్టుకు రూ.27,089 కోట్లు ఖర్చు కాగా, మిగిలిన పనులకు మరో రూ.5,108 కోట్లు అవసరమని అధికారులు వివరించారు.రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు స్టేజ్-1 పనులను జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. హంద్రీనీవా ద్వారా ఇప్పటివరకు 52 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని, వంశధార నదిపై ప్రతిష్ఠాత్మకమైన నేరడి బ్యారేజ్‌కు అడ్డంకులు తొలగినందున వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికెపుడిశెల ప్రాజెక్టు పనులనూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. పోలవరం-నల్లమల సాగర్ అనుసంధానానికి సంబంధించిన డీపీఆర్‌కు త్వరగా ఆమోదం పొందేలా చూడాలని సూచించారు.

రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ చర్యల వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయని అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది 0.79 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు.

గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పునరుద్ధరించేందుకు త్వరగా టెండర్లు పిలవాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హోర్ముజ్‌ను తెరుస్తున్నాం

వాషింగ్టన్ : ప్రపంచ దేశాల కోసం హోర్ముజ్ జలసంధిని శాశ్వతంగా తెరుస్తున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. 'హోర్ముజ్ జల సంధిని నేను శాశ్వతంగా తెరిచినందుకు చైనా చాలా సంతోషిస్తోంది. నేను చైనా కోసం‌ప్రపంచం కోసం ఆ పని చేశాను. ఈ పరిస్థితి ఇకపై ఎన్నడూ ఉత్ప న్నం కాదు. ఇరాన్‌కు ఆయుధాలు పంపరాదని వారు అంగీకరించారు. కొన్ని వారాల క్రితం నేను అక్కడికి వెళ్లినప్పుడు అధ్యక్షుడు జిన్‌పింగ్ నన్ను పెద్దగా, బలంగా హత్తుకున్నారు. మేము కలిసి పనిచేసుకుం టున్నాం' అని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. కాగా ఇరాన్‌కు ఆయుధాలు అందించవద్దని జిన్‌పింగ్‌కు లేఖ రాశా నని ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇరాన్‌కు చైనా ఆయుధాలు అందిస్తోం దని తాను విన్నానని, అలా చేయవద్దని కోరుతూ లేఖ రాశానని చెప్పారు. తాను అలా చేయడం లేదని జిన్‌పింగ్ ప్రత్యుత్తరం ఇచ్చారని అన్నారు.



### ఇరాన్ యుద్ధం ముగియబోతోంది

ఇరాన్‌పై మొదలు పెట్టిన యుద్ధం త్వరలోనే ముగియబోతోందని అమెరికా అధ్యక్షుడు చెప్పారు. యుద్ధాన్ని సైనిక చర్యతో ముగించబోవడం లేదని ఆయన తెలిపారు. ఇరాన్‌తో రెండో విడత చర్చలకు అమెరికా సిద్ధమవుతున్న వేళ ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 'మాపని ఇంకా పూర్తి కాలేదు. మేము నిష్క్రమిస్తే ఇరాన్ పునర్నిర్మాణానికి 20 సంవత్సరాలు పడుతుంది. ఏం జరుగుతుందో చూద్దాం. ఒప్పందం చేసుకోవాలని వారు బలంగా కోరుకుంటున్నారని నేను అనుకుంటున్నాను' అని ట్రంప్ చెప్పారు. ఫాక్స్ బిజినెస్ ప్రతినిధితో ట్రంప్ బుధవారం మాట్లాడుతూ ఇరాన్‌పై ప్రత్యక్ష దాడి చేయాలన్న తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఇరాన్ అణు సామర్థ్యాన్ని నిర్మూలించడానికి ఆ చర్య అవసరమని అన్నారు. 'నేను ఆ పనిచేయకపోతే ఇరాన్ వద్ద ఇప్పటికే అణ్వాయుధం ఉండేది. ఒకవేళ వారి వద్ద అణ్వాయుధం ఉంటే మీరు వారిని సర్ అని వినయంగా పిలవాల్సి వచ్చేది. అలా జరగాలని ఎవరూ కోరుకోరు' అని ట్రంప్ చెప్పారు. అలాగే పదివేల మందితో యూఎస్ బలగాలు పశ్చిమాసియాలో మకాం వేసి ఉన్నట్టు తెలిపారు.

### హోర్ముజ్‌లో నౌకల రవాణాను అనుమతించండి : అమెరికాను కోరిన సౌదీ

హోర్ముజ్ జలసంధి మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ఇరాన్‌తో చర్చలు జరపాలని అమెరికా ప్రభుత్వాన్ని సౌదీ అరేబియా కోరింది. లేకుంటే ప్రాంతీయ, ఆర్థిక సంక్షోభం తీవ్రతరమవుతుందని హెచ్చరించింది. హోర్ముజ్ మూసివేతకు ప్రతీకారంగా గల్ఫ్‌కు ఆవల ఇరాన్ దాడులు చేయవచ్చునని, ఇతర కీలక సముద్ర మార్గాలను అడ్డుకోవచ్చునని అరబ్ అధికారులు వాషింగ్టన్ పోస్ట్ పత్రికకు తెలియజేశారు. సౌదీ అరేబియాలోని కీలక బాబ్ అల్-మందెబ్ జలసంధిని ఇరాన్ లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉన్నదని సౌదీ ఆందోళన చెందుతోంది. ఎర్ర సముద్రంలోని ఈ జలసంధి ద్వారానే సౌదీ నుంచి చమురు ఎగుమతులు ఎక్కువగా జరుగుతుంటాయి. బాబ్ ఎల్-మందెబ్‌ను మూసివేయాలని ఇరాన్ అనుకుంటే హౌతీలు జత కలుస్తారని యెమన్ నిపుణుడు ఆడం బరన్ చెప్పారు. గాజా ఘర్షణ సమయంలో హౌతీలు తమ సామర్థ్యాన్ని ప్రదర్శించారని ఆయన గుర్తు చేశారు.

# 'డీలిమిటేషన్'ను వ్యతిరేకిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

ప్రతిపక్షనేత,ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో బుధవారం సాయంత్రం ఇండియా వేదిక పార్టీ నేతల సమావేశం జరిగింది. వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికలతో పాటు, డీ లిమిటేషన్, మహిళారిజర్వేషన్ల బిల్లు అంశాలను చర్చించాయి. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను తీసుకువస్తున్నట్లు సమావేశంలో నేతలు అభిప్రాయపడ్డారు. అనంతరం మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడుతూ డీ లిమిటేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఇండియా వేదిక పార్టీలు పార్లమెంటులో ఐక్యంగా పోరాడుతాయని చెప్పారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్ విభజన నిర్ణయం తీసుకుందని అన్నారు. తొలుత జనగణన పూర్తి చేయాలని, కొత్త జనాభా లెక్కల ఆధారంగానే డీ లిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అదేసమయంలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా వేదిక అనుకూలంగా ఉందని, దానిని వ్యతిరేకించడం లేదని అన్నారు. అయితే, మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రం తీసుకువస్తున్న తీరు సరికాదని చెప్పారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని విమర్శించారు. రాజ్యాంగంలోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. 'డీలిమిటేషన్‌కు సంబంధించి జనాభా గణన అంశంపై స్పష్టత లేదు. రాజ్యాంగంలోని అన్ని హక్కుల్ని తీసేసుకుంటున్నారు.

# సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు..

**మొదటిపేజీ తరువాయి**

డిటోనేటర్లు మొదట పేలాయి. ఈ పేలుడు ధాటికి మంటలు చెలరేగి, అక్కడే ఉన్న గ్యాస్ సిలిండర్లకు అంటుకున్నాయి. దీంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించి, ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ దుర్ఘటనపై మంత్రి సత్యకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అక్రమంగా డిటోనేటర్లు ఎందుకు నిల్వ ఉంచారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లోకేశ్

**మొదటిపేజీ తరువాయి**

29 మందితో పొలిట్ బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీ కూర్పు చేశారు.జాతీయ ప్రధాన కార్యదర్శులు-3, జాతీయ ఉపాధ్యక్షులు-18, జాతీయ అధికార ప్రతినిధులు-10రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు-7, రాష్ట్ర ఉపాధ్యక్షులు-16, రాష్ట్ర అధికార ప్రతినిధులు-14, రాష్ట్ర జోనల్ కో-ఆర్డినేటర్లు-10, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు-59, రాష్ట్ర కార్యదర్శులు-77 తో పునర్నిర్మించారు.ఓ మండల పార్టీ అధ్యక్షురాలికి, ఓ క్లస్టర్ ఇన్చార్జికి నేరుగా పొలిట్ బ్యూరోలో చోటు కల్పిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీ అత్యున్నత స్థాయి కమిటీ పొలిట్ బ్యూరోలో చోటు దక్కించుకున్న గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గుత్తికొండ ధనుంజయ్ అత్యున్నత స్థాయికి ఎదిగారు. రాష్ట్ర కమిటీలోని 185 మందికి గానూ... 50 మంది మహిళలకు చోటు, పొలిట్ బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ మహిళలకు సముచిత స్థానం కల్పించారు. జనాభా దామాషా పద్ధతిన, సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పు చేశారు. 185 మంది రాష్ట్ర కమిటీ సభ్యుల్లో 122 మంది బడుగులకు స్థానం కల్పించింది. బీసీ-77, ఎస్సీ-25, ఎస్టీ-7, మైనార్టీ-13 మందికి రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని కోణాల్లో విశ్లేషించి చంద్రబాబు కమిటీల కూర్పు చేపట్టినట్లు అర్థంఅ వుతోంది.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు కూటమి సంపూర్ణ మద్దతు

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో జరిగిన కూటమి నేతల సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానం చేశారు. ఈ బిల్లు విషయంలో రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తీసుకురావాలని, వైసీపీని సైతం ఆహ్వానించాలని నిర్ణయించారు. ఈ భేటీలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.దాదాపు రెండున్నర గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. లోక్‌సభలో మహిళా బిల్లుపై ఈ నెల 17న చర్చ జరగనుండగా, అదే రోజున అమరావతిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ ఈ కార్యక్రమానికి హాజరై, సభా కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులతో పాటు రాష్ట్రంలోని మహిళా ప్రముఖులను కూడా ఆహ్వానించాలని నిర్ణయించారు.బిల్లు ప్రవేశపెట్టే రోజున రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీకి, మహిళలకు కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లా, నియోజకవర్గ స్థాయిలో విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని కూడా సమావేశంలో చర్చించారు. ర

# పేదల కడుపు నిండినప్పుడే నిజమైన అభివృద్ధి

పేదల కడుపు నిండినపుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, ఎంత అభివృద్ధి సాధించినా పేదలకు పట్టెడన్నం లేకపోతే అది వృధా అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అన్నార్తుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని ధరణికోటలో ఏర్పాటు చేసిన గ్రామీణ అన్న క్యాంటీన్‌ను ఆయన కార్మికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.5 వెచ్చించి టోకెన్ కొనుగోలు చేసి, అక్కడి కార్మికులతో కలిసి భోజనం చేశారు. అంతకుముందు, క్యాంటీన్‌కు వచ్చిన పేదలకు, కార్మికులకు ఆయనే స్వయంగా వడ్డించారు.ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ, "పేదవాడి ఆకలి తీర్చడానికే ప్రజా ప్రభుత్వం అన్న క్యాంటీన్లు తెచ్చింది. ఎన్టీఆర్ రూ.2కే కిలో బియ్యం ఇచ్చి ఆహార భద్రతకు నాంది పలికారు. అదే స్ఫూర్తితో సంక్షేమాన్ని కొనసాగిస్తున్నాం" అని అన్నారు. 2024లో అధికారంలోకి రాగానే తొలుత పట్టణాల్లో, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. కొత్తగా 62 గ్రామీణ క్యాంటీన్లు ప్రారంభం కావడంతో, రాష్ట్రంలో మొత్తం క్యాంటీన్ల సంఖ్య 269కి చేరిందని, త్వరలో మరో 5 సిద్ధమవుతాయని వివరించారు.అన్న క్యాంటీన్ల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రోజూ 2.10 లక్షల మంది ఆకలి తీర్చుకుంటున్నారని, దీనికోసం ప్రభుత్వం రోజుకు రూ.54 లక్షలకు పైగా ఖర్చు చేస్తోందని సీఎం తెలిపారు. నాణ్యమైన భోజనం అందించడంలో అక్షయపాత్ర ఫౌండేషన్ సేవలను ఆయన అభినందించారు. కొత్తగా ప్రారంభించిన క్యాంటీన్ల నిర్మాణానికి రూ.43 కోట్లు, వాటి నిర్వహణకు ఏడాదికి అదనంగా రూ.58 కోట్లు ఖర్చవుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "గత పాలకులు అన్న క్యాంటీన్లను మూసివేసి పేదల పొట్టగొట్టారు. వారికి విధ్వంసం, హింస, కూల్చడం మాత్రమే తెలుసు. అందుకే ఆ పార్టీ పేరును 'గొడ్డలి పార్టీ'గా మార్చుకోవాలి. ఒక రాజకీయ పార్టీగా ఉండే అర్హతను వైసీపీ కోల్పోయింది" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రవీణ్, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల హక్కుల్ని చంద్రబాబు తాత కూడా తీసుకోలేరు: జగన్

**మొదటిపేజీ తరువాయి**

నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా ఆయన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశామని జగన్ గుర్తుచేశారు. రాష్ట్రంలో రూ.26 వేల కోట్లతో నాలుగు కొత్త పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మచిలీపట్నం, మూలపేట పోర్టుల పనులు 35 శాతం పూర్తి చేశామని, రామాయపట్నం పోర్టు పనులు దాదాపు పూర్తయ్యాయని వివరించారు.

2024 మార్చి 12న తాము జువ్వలదిన్నె హార్బర్‌ను వర్చువల్‌గా ప్రారంభించామని, కానీ నేటికీ దానిని మత్స్యకారులకు ఎందుకు అప్పగించలేదని కూటమి ప్రభుత్వాన్ని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం మత్స్యకారులకు మేలు చేయకపోగా, వారి పొట్ట కొడుతోందని విమర్శించారు. జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమివేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

మార్చి 12న నారా లోకేశ్ జువ్వలదిన్నెను సందర్శించగా, 16న ఇక్కడ సీజ్ చేసిన బోట్లు ఎత్తుకెళ్లిపోయారని జగన్ ఆరోపించారు. అధికారంలో ఉన్న పెద్దలే ఈ దొంగతనం చేశారని, అందుకే ఒక్కరినీ అరెస్టు చేయలేదని అన్నారు. బోట్లు ఎత్తుకెళ్లేవారికి ముఖ్యమంత్రి కొడుకు ఆశీస్సులు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది నిర్లక్ష్యానికి తావు ఉండకూడదు.

**అకస్మిక తనిఖీలో గైర్హాజరు సిబ్బందిపై చర్యలకు ఆదేశాలు. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 15:**
మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై సమగ్రంగా ఆరా తీసిన కలెక్టర్, సిబ్బంది నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీ సమయంలో ఉదయం 10:10 గంటల వరకు ఇద్దరు వైద్యులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్ట్ విధులకు హాజరు కాలేదని గుర్తించారు. అంతేకాకుండా విధులకు హాజరుకాని ముగ్గురు సిబ్బంది తరఫున ఎంపీహెచ్ఓ ద్వారా మూమెంట్ రిజిస్టర్‌లో సంతకాలు చేయడం వెలుగులోకి రావడం తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన కలెక్టర్, సంబంధిత ఐదుగురు సిబ్బందిపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ సేవల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, ఇలాంటి నిర్లక్ష్యం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా, ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని, ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల ఆరోగ్యం పరిరక్షణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని, అందువల్ల సేవలలో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు.

## సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి.

**నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.రాజకుమారి.**
**గైర్హాజరు, నిర్లక్ష్యంపై కఠిన చర్యలు.**
**ఆన్‌లైన్ హాజరు నమోదుపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి.**
**పి జి ఆర్ ఎస్ ఫిర్యాదులు సమయానికి పరిష్కరించాలి.**
**పారిశుధ్యంపై గ్రామస్థుల ఫిర్యాదులకు వెంటనే పరిష్కరించండి.**





**ఆంధ్ర ప్రగతి మహానంది/నంద్యాల, ఏప్రిల్ 15:**
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలు గ్రామస్థులకు సమర్థవంతంగా చేరాలంటే సచివాలయ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలం తిమ్మాపురం, అబ్బీపురం గ్రామాలలోని స్వర్ణ గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై కలెక్టర్ సమగ్రంగా ఆరా తీశారు. ముఖ్యంగా సిబ్బంది ఆన్‌లైన్ హాజరు నమోదును పరిశీలించి, విధులకు సమయానికి హాజరై బాధ్యతాయుతంగా సేవలు అందించాలని స్పష్టం చేశారు. హాజరు నమోదులో ఏవైనా లోపాలు, నిర్లక్ష్యం గమనించినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు గ్రామస్తులతో మాట్లాడిన కలెక్టర్, సచివాలయ సిబ్బంది ప్రవర్తన, సేవల నాణ్యతపై ఫీడ్‌బ్యాక్ సేకరించారు. ప్రజల సమస్యలను సమయానికి పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై నమ్మకం పెంచాలని సూచించారు.
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చే వినతులను నిర్లక్ష్యం చేయకుండా, నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకుని పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులపై గ్రామస్తులు చేసిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని, వెంటనే అన్ని ప్రాంతాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను ఆదేశించారు. సచివాలయ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువ కావాలంటే క్రమశిక్షణ, బాధ్యతాయుత సేవా దృక్పథం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా, సమయానికి అందేలా ప్రతి సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

## పైప్ లైన్ లీకేజీ..
### బొల్లవరం లో త్రాగునీటికి కటకట..!
### ...కనిపించని పంచాయతీ కార్యదర్శి.



**ఆంధ్ర ప్రగతి మహానంది ఏప్రిల్ 15:**
త్రాగునీటి పైప్లైన్ లీకేజీ.. కారణంగా తాగునీటికి కటకట ఏర్పడిందని బొల్లవరం గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామ కార్యదర్శి కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. దాదాపు రెండు వారాల క్రితం త్రాగునీటి పైప్లైన్ లీకేజీ అయినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. బురద నీరే తాగునీటిగా వాడుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. త్రాగునీటి కోసం రెండు బోర్లు ఉండగా ఒక బోరు మాత్రమే పనిచేస్తుందని మరో బోరు చెడిపోయి చాలా రోజులు కావస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బొల్లవరం గ్రామంలో



పెద్దమ్మ జాతర పూర్తి అయి నెల రోజులు దాటినా కూడా అప్పటి వ్యర్థాలు నేటికీ కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. గ్రామంలో ఇంతవరకు బ్లీచింగ్ కూడా చల్ల లేదంటే ఆ పంచాయతీ కార్యదర్శి పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామం మొదట ఉన్న ఎస్సీ కాలనీ రహదారి దుర్గంధం వెదజల్లుతున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామం నడిబొడ్డున చెత్తాచెదారం వేసి నిప్పు అంటిస్తున్నారే తప్ప శుభ్రపరచడానికి ప్రయత్నించడం లేదని వ్యర్థాలు పేరుకుపోతున్న ఇవి ఏమి పట్టించుకోకపోవడం వారి పనితీరు నకు నిదర్శనం. వేసవి కాలం నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేరుకే, ప్రకటనలకే పరిమితం అవుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇంతకు ఆ కార్యదర్శి ఉన్నట్టా లేనట్టా అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

## పట్టాధార్ పాస్‌బుక్‌ల పంపిణీ మార్చి 2027 నాటికి పూర్తి చేయాలి

**వర్షపు నీటిని నిలువ చేసే చర్యలు తీసుకోవాలి.**
**- అన్ని చెరువు లు నీటితో నింపాలి.**
**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు , ఏప్రిల్ 15:**
రాష్ట్ర చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ నుండి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. బుధవారం సాయంకాలం చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ అన్ని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి అధికారులతో మాట్లాడుతూ...22ఏ రికార్డు లు సరి చేయాలని , రెవెన్యూ రికార్డు ల డిజిటలైజషన్ లు త్వరగా చేయాలని , రీసర్వే పనులు అన్ని పూర్తి చేసుకుని మార్చి 2027 నాటికి అన్ని పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణి పూర్తి చేయాలని , గత కొన్ని నెలల నుండి పెండింగ్‌లో ఉన్న అన్ని మ్యుటేషన్‌లు మరియు సబ్-డివిజన్‌లను జూన్ 2026 నాటికి పూర్తి చేయాలి అని,పట్టా దార్ పాసుబుక్ ల పంపిణీ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి గారు రీ సర్వేను సమీక్షిస్తారు. ఎలాంటి తప్పులు లేని పాస్‌బుక్‌లు జారీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కావున ఎలాంటి తప్పులు ఉండరాదని పాస్‌బుక్‌ల విషయంలో ఏమాత్రం పొరపాట్లు జరిగినా, సంబంధిత అధికారులందరిపై కఠిన చర్యలు తీసుకోబడతాయి అని కలెక్టర్ తెలిపారు. వర్షపు నీటిని నిలువ చేసుకునే అన్ని చర్యలు, చెరువుల లో ఉన్న పూడికలు, పంటకాలువల పూడికలు తీసే చర్యలు చేపట్టాలని అన్ని చెరువులు నీటితో నింపే చర్యలు తీసుకోవాలి అని వీటి ద్వారా భూగర్భ జలాలు పెరిగే చర్యలు చేపట్టాలని అని కలెక్టర్ ఆదేశించారు. ట్యాంక్ వైస్ యాక్షన్ ప్లాన్ తయారు చేసి ఒక ట్యాంక్ నుంచి ఇంకో ట్యాంక్ కు నీరు చేరే లాగా అనుసంధానం చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలు పెట్టి
మాస్టర్ ట్రైనర్స్ ని గుర్తించాలి అన్నారు. గుర్తించిన వారిని అన్నమయ్య జిల్లాకు పంపించి అక్కడ వారికి ట్రైనింగ్ ఇప్పించి కర్నూలు జిల్లా లో ఆవిధంగా పనులు జరిగే లాగా చర్యలు తీసుకోమని అధికారులను ఆదేశించారు. ఒక గ్రామపంచాయతీలో ఎన్ని ట్యాంకులు ఉన్నాయి? ఆ ట్యాంకులకు సంబంధించి జరుగవలసిన మరమ్మత్తు పనులు గుర్తించి వాటిలో ఎన్ని అప్రూవ్ చేశారో ఆ ట్యాంకులకు ఇప్పుడు ఎస్టిమేట్ జెనరేట్ చేయాలి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ఇన్చార్జ్ డిఆర్ఓ చిరంజీవి , జిల్లా పరిషత్ సీఈవో రమణారెడ్డి, డ్వామా పిడి నరసింహారెడ్డి , పంచాయతీ రాజ్ ఎస్ఈ ప్రభాకర్ రెడ్డి , డిజాస్టర్ మేనేజ్మెంట్ పి ఓ సురేష్ కుమార్ , పశుసంవర్ధక శాఖ జెడి హేమంత్ కుమార్ , ఎస్ డి సి నాగప్రసూన , డిపిఓ భాస్కర్ , గ్రౌండ్ వాటర్ డి. డి. సునీల్ కుమార్,తహసీల్దార్ లు వెంకటేశ్వర్లు , ప్రకాష్ బాబు మొదలగు వారు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసమే భరత్ విజయ రహస్యం.
### ..అంగవైకల్యం అడ్డు కాదు  రాష్ట్ర స్థాయికి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 15:** అయ్యలూరులోని ఎస్ వి ఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ కు చెందిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థి పీ. భరత్ కుమార్ డ్రాగన్ బోట్ క్రీడలో ప్రతిభ చూపుతూ రాష్ట్ర స్థాయి పోటీలో ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభా కనబరిచిన పి. భరత్ కుమార్ కు ఏప్రిల్ 11, 12 తేదీలలో విజయవాడ నగరంలో జరిగిన డ్రాగన్ బోట్ అండర్ -18 రాష్ట్ర స్థాయి పోటీలో బ్రాంచ్ మెడల్ సాధించడం జరిగినది. శారీరక అంగవైకల్యం ఉన్నప్పటికీ క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా కళాశాల ఎం.డి. దినేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ వై. హరిప్రసాద్ రెడ్డి, హెచ్ & ఎస్ శ్రీ నరసింహారావు, పీ.డి. విల్సన్ కుమార్ భరత్ కుమార్ ను అభినందిస్తూ, "అంగవైకల్యం అడ్డు కాదు సరైన ప్రోత్సాహం ఉంటే ప్రతిభ ఎక్కడికైనా చేరుతుంది" అని పేర్కొన్నారు.

## శాప్ 2026, డ్రాగెన్ బోటింగ్ స్టేట్ లెవెల్ లో..
## విజయభేరి మ్రోగించిన బాల అకాడమీ విద్యార్థులు.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 15:** శాప్ 2026 డ్రాగన్ బోటింగ్ స్టేట్ లెవెల్ కాంపిటీషన్లో బాలకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. అందుకుగాను విద్యార్థుల మరియు వారి తల్లిద్రండ్రులను సన్మానించిన బాల అకాడమీ స్థానిక నంద్యాల జిల్లాలోని పార్కు రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ రవీంద్ర హాయ్ స్కూల్ పాఠశాల విద్యార్థినులు 12వ తేదిన విజయవాడ లోని కృష్ణ నదిలో శాప్ అధ్యర్వంలో స్టేట్ లెవెల్ లో జరిగిన డ్రాగెన్ బోటింగ్ కంపిటిషయాన్ లో అండర్ 15 విభాగములో ద్వితీయా స్థానములో బహుమతి సాధించారు. శాప్ డైరెక్టర్ గారిచే బహుమతులను, ప్రశంస పత్రాలను అందుకొన్నారు. విజేతలుగా నిలచిన బాల అకాడమీ పాఠశాల విద్యార్థినీలు అయిన మనోజ్ఞ, షణ్ముఖ ప్రియ, అఫ్రాన్, ముస్కాన్, జోహార్ ఖాన్, సత్యవైష్ణవి, శ్రీవిద్యలను. పాఠశాల డైరెక్టర్ ఎం జీ.వి రవీంద్రనాథ్, కరస్పాండెంట్ శ్రీ మతి మాధవీలత ప్రత్యేకమైన అభినందనలు తెలియజేసి విద్యార్థినులను వారి తల్లిదండ్రులను సన్మానించారు. ముందుముందు ఇంకా ఎన్నో విజయాలను సాధించాలని కోరుతూ, విద్యార్థినుల తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయులకు ధన్యవదములను తెలియజేశారు.

## నల్లమల ఆలయ అభివృద్ధికి అడ్డంకులు తొలగించండి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 15:**
ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శ్రీ సర్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్రుడు నంద్యాల జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సిరివెళ్ల మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న సర్వ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి పనులకు అటవీశాఖ అధికారుల అడ్డంకులు తొలగించాలని కోరారు. ఆలయ పరిసరాల్లో ప్రహరీ గోడ నిర్మాణం, మరుగుదొడ్లు, పైపులైన్ వంటి ప్రాథమిక సదుపాయాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నప్పటికీ అటవీశాఖ అధికారులు పనులు నిలిపివేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న పనులకు అనుమతులు ఇచ్చి అభివృద్ధి కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఆలయ అభివృద్ధికి సంబంధించి అటవీశాఖతో సమన్వయం చేసి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

## ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్టుల క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి టీజీ భరత్ గుప్తా.




**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ ఏప్రిల్ 15:**
రాష్టమంత్రి టీజీ భరత్ గుప్తా కార్యాలయంలో ఫోటో జర్నలిస్టులు మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అంతేకాకుండా పోస్టల్ డిపార్ట్మెంట్ ఆక్సిడెంట్ ఇన్సూరెన్స్ కార్డులను కర్నూల్ ప్రెస్ ఫోటోగ్రాఫర్ల చేతులకు అందించినారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ కర్నూల్ ఫోటోగ్రాఫర్లు ఎప్పుడు బిజీగా ఉండి ఆ యా ఫోటోలను సేకరిస్తున్న సందర్భంగా ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు కనుక ఇటువంటి యాక్సిడెంట్ స్కీములు గాని హెల్త్ కార్డులు చేయించుకోవాలన్నారు.
ఎక్కడైనా జరగరానిది జరిగితే కుటుంబాలకు తగిన సహాయం చేకూర్తుందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఏ పీ పీ జే ఏ క్యాలెండర్ ని ఆవిష్కరించడం ఎంతో సంతోషించదగ్గ విషయము అన్నారు. యాక్సిడెంట్ పోస్టల్ ఇన్సూరెన్స్ 10 లక్షల చేయించుకోవడం కూడా మంచి శుభ పరిణామం ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కర్నూల్ ఫోటో జర్నలిస్ట్ ప్రెసిడెంట్ నాయకుల సుధాకర్ ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ రఫీ సూర్య ఫోటోగ్రాఫర్ ఆంజనేయులు. ఫోటోగ్రాఫర్ గిరి. తదితరులు పాల్గొన్నారు

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# 100 రోజుల జలధార తో భూగర్భ జలాల పెంపు.

**నంద్యాలలో నీటి కొరత నివారణకు సమగ్ర కార్యాచరణ.**

**వాగుల పునరుద్ధరణ, క్యాస్కేడ్ వ్యవస్థల బలోపేతంపై దృష్టి.**

**పెన్నా-కృష్ణా బేసిన్ల ఆధారంగా ప్రణాళికలు.**

**389 పనులతో నీటి నిర్వహణ యాక్షన్ ప్లాన్ సిద్ధం.**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 15:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన '100 రోజుల జలధార' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, జిల్లాలో భూగర్భ జలాల మట్టాన్ని 3 నుండి 6 మీటర్ల వరకు పెంచాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో '100 రోజుల జలధార' కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జల వనరుల శాఖ ఎస్ఈ శివశంకర్ రెడ్డి, భూగర్భ జల అధికారి రఘురాం, డ్వామా పీడీ సూర్యనారాయణ, జలదార కార్యక్రమ ప్రత్యేక అధికారి లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, '100 రోజుల జలధార' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసి భూగర్భ జల మట్టాన్ని పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాగుల పునరుద్ధరణ, క్యాస్కేడ్ వ్యవస్థల బలోపేతం, స్ట్రీమ్ కనెక్టివిటీ, భాగస్వామ్య భూగర్భ జలాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**తేమగా లేని పొడి వాతావరణం.. నీటి కొరత సవాళ్లు**
నంద్యాల జిల్లాలో తేమగా లేని పొడి వాతావరణ పరిస్థితులు ఉండటంతో, భూగర్భ జలాలు ప్రధానంగా వర్షాధారంగా ఉంటున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. సాగు కోసం అధికంగా భూగర్భ జలాలపై ఆధారపడటం వల్ల అనేక మండలాల్లో నీటి మట్టాలు తగ్గిపోవడంతో పాటు కాలానుగుణంగా నీటి కొరత తీవ్రంగా మారుతోందన్నారు.

**పెన్నా - కృష్ణా బేసిన్ల ప్రాధాన్యం**
జిల్లాలో 70 శాతం విస్తీర్ణం పెన్నా బేసిన్ పరిధిలో ఉండగా, మిగిలిన 30 శాతం కృష్ణా బేసిన్‌లో ఉందన్నారు. కుందేరు, గుండ్లకమ్మ వంటి ఉపబేసిన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, మొత్తం 46 మైక్రో బేసిన్ల ఆధారంగా సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

**ట్యాంక్ క్యాస్కేడ్ వ్యవస్థల బలోపేతం**
జిల్లాలో 330 చెరువుల్లో 27 క్యాస్కేడ్ వ్యవస్థలు ఉండి, అవి 86 చెరువులను అనుసంధానిస్తున్నాయని తెలిపారు. క్యాస్కేడ్ కనెక్టివిటీ, స్ట్రీమ్ కనెక్టివిటీ మెరుగుపరచడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

**389 పనులతో యాక్షన్ ప్లాన్ సిద్ధం**
జిల్లాలో నీటి నిర్వహణకు సంబంధించి 389 పనులను గుర్తించి, ఫీడర్ ఛానళ్లు శుభ్రపరచడం, డీ-సిల్టింగ్, చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 407 పనుల డేటా సేకరణ జరగగా, 155 పనులను ధృవీకరించి, మిగిలినవి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

**క్షేత్రస్థాయిలో సమస్యలు - వెంటనే పరిష్కారం అవసరం**
కాలువలు గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిపోవడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందని, వీటి తొలగింపుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద జంగిల్ క్లీనింగ్ పనులను చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
భూగర్భ జలాల సంక్షోభ మండలాలపై ప్రత్యేక దృష్టి
జిల్లాలో 11 మండలాల్లో భూగర్భ జలాల సమస్య తీవ్రంగా ఉందని పేర్కొంటూ, పాణ్యం, డోన్, బేతంచెర్ల, బనగానపల్లి, సంజామల, కొలిమిగుండ్ల వంటి ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. రిడ్జ్ టు వ్యాలీ కాన్సెప్ట్ ద్వారా నీటి నిల్వను పెంచాలని తెలిపారు.

**ఫార్మ్ పాండ్స్, చెక్ డ్యామ్ ల వినియోగం**
ఇప్పటివరకు 22,221 ఫార్మ్ పాండ్స్, చెక్ డ్యామ్ ల ద్వారా నీటిని నిల్వ చేసినప్పటికీ, ఇంకా నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చెరువుల మొత్తం నిల్వ సామర్థ్యం 5.5 టీఎంసీగా ఉన్నప్పటికీ, దీన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

**టెక్నాలజీ వినియోగం - పారదర్శకతకు ప్రాధాన్యం**
పనుల పురోగతిని యాప్ ద్వారా నమోదు చేయడంలో ఉన్న సాంకేతిక సమస్యలను త్వరగా పరిష్కరించాలని, జియో ట్యాగింగ్, రియల్ టైమ్ డేటా అప్డేట్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అధికారులు కేవలం రికార్డులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలనలు చేయాలని సూచించారు.

**నీటి భద్రతే ప్రధాన లక్ష్యం**
జిల్లాలో నీటి వనరుల సమగ్ర వినియోగం, భూగర్భ జలాల రీచార్జ్, వాగుల పునరుద్ధరణ ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించడమే ప్రధాన లక్ష్యమని కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు.

# జలధార-జలహారతి కార్యక్రమంలో భౌగోళిక సాంకేతికతల వినియోగం.

**..నీటి భద్రత పెంపుకు ఏపీ ఎస్ఎ సి ప్రత్యేక చర్యలు.**

**జిల్లా, మండల స్థాయి జల వనరుల మ్యాపుల సమర్పణ. -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 15:**
రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలవుతున్న జలాధార – జలహారతి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా, వ్యవసాయం, తాగునీటి సరఫరా మరియు భూగర్భ జలాల పునరుద్ధరణ లక్ష్యంగా భౌగోళిక సాంకేతికతలను సమర్థవంతంగా వినియోగించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్, ఐటి & ఈసీ విభాగం ఆధ్వర్యంలో జిల్లాకు నియమితులైన శాస్త్రవేత్త కె. లక్ష్మీకాంత రెడ్డి జిల్లా, మండల స్థాయి జల వనరుల మ్యాపుల వివరాలను కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త జిల్లా కలెక్టర్‌తో సమావేశమై, జిల్లా మరియు మండల స్థాయిలో రూపొందించిన భౌగోళిక పటాలను సమర్పించారు. ఈ మ్యాపులలో వాగులు, కాలువలు, చెరువులు, నదులు, రిజర్వాయర్లు వంటి ఉపరితల జల వనరుల వివరాలతో పాటు జిల్లా, మండలాలు, గ్రామాలు, నివాస ప్రాంతాల పరిపాలనా సరిహద్దులు పొందుపరిచారు. అదనంగా రైల్వే మార్గాలు, రహదారి జాలం వంటి మౌలిక వసతుల వివరాలు కూడా చేర్చబడ్డాయి. ఈ పటాలు సాగునీటి శాఖకు గ్రామ స్థాయిలో ప్రణాళికలు రూపొందించడంలో, సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవడంలో కీలకంగా ఉపయోగపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో నీటి భద్రతను మెరుగుపర్చడమే లక్ష్యంగా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# నవయుగంలో నవ యువకుడు మంత్రి ఎన్ ఎం డి. ఫరూక్.!

**..నంద్యాలను అభివృద్ధి పదంలో నడిపిస్తున్న మంత్రి ఫరూక్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఏప్రిల్ 15:**
నంద్యాల చరిత్రలో ఒక్క వార్డులో నే అదికూడా గతంలో వైసిపి వార్డ్ అని చూడకుండా నంద్యాలలో అన్ని వార్డు ముఖ్యమని భావించిన పెద్దాయన మంత్రి ఫరూక్ పార్టీలు ప్రక్కన పెట్టి ఏకంగా 2.5 కోట్ల పనులకు భూమి పూజ చేయడం తో ప్రజలు మంత్రిని ఆకాశానికి ఎత్తుతున్నారు. గతంలో ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకుల విభేదాల మధ్య ప్రజలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఎన్నికల సమయంలో 42 వార్డుల్లో పర్యటన సమయంలో ఫరూక్ దృష్టికి అభివృద్ధి జరగని వార్డుల్లో ప్రజలు తమ సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అందరి ప్రశ్నలకు ఓపికగా సమాధానం ఇస్తూ అధికారం వచ్చిన తర్వాత మీ వార్డ్ కాదు అన్ని వార్డుల్లో అభివృద్ధి ఎలా ఉంటుందో చెప్పాను, చేసి చూపిస్తాను. రాజకీయాలు ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలి నంద్యాల ప్రజలు ఇప్పటికే మూడు సార్లు అధికారం ఇచ్చారు, ఈ సారి నాల్గవసారి అధికారం ఇస్తున్నారు. రాష్ట్రే వ్యాప్తంగా నంద్యాల ప్రజలు నాకు, నా కుటుంబానికి మంచి గుర్తింపు, పేరు తీసుకొచ్చారు. అలాంటి నంద్యాల ప్రజలకు పార్టీలతో సంబంధం లేకుండా అభివృద్ధి ఏమిటో చూపిస్తానని చెప్పిన మాటకు కట్టుబడి ఏకంగా 32 వార్డుకు 2.5 కోట్ల పనులకు శ్రీకారం చుట్టారు. ఇవే కాకుండా ఒక వారంలో మున్సిపాలిటీలో 15 ఆర్థిక సంఘం నిధుల నుంచి మరో 2.5 కోట్ల టెండర్ పనులు ఒకే అయ్యాయి. ఆ పనులు కూడా రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తారు. ఒకవిషయం ప్రజలు చర్చించుకోవడం విశేషం 2024 ఎన్నికలు అంటే మనుషులు మండిపోయే ఎన్నికలు అని అందరూ అనుకున్న విషయంనామ విదితమే. యువత, పెద్దలు సైతం ఆ ఎన్నికల్లో ప్రచారం చేయాలంటే ఎంతో ఇబ్బందులు పడ్డారు. తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలి అని చెప్పడం, ఛాలెంజ్ గా తీసుకొని అటు వైపు భారీగా డబ్బు ఖర్చు పెట్టే శిల్పా కుటుంబం పొలపలు అనే పేరు ఉండడంతో డబ్బు మంచినీళ్లు ళ్లా ఖర్చు చేస్తారు, ఫరూక్ ఖర్చు చేయరూ అనే ప్రచారం జరిగినా అవన్నీ లెక్కచేయకుండా నంద్యాల, గోస్పాడు నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామంలో తడదైన శైలిలో ఎండను లెక్కచేయకుండా ప్రచారం చేసి విమర్శలు చేసే వారి నోళ్ళు మూయించి భారీ విజయం ఫరూక్ సాధించారు. నంద్యాల ప్రజలకు చెప్పిన విధంగా ఒకొక్క అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతున్నారు. రాణీ, మహారాణి వద్ద గత 20 ఏళ్లుగా కనీసం నాణ్యతతో కూడిన తారు రోడ్డు లేక నందమూరి నగర్, వైఎస్సార్ నగర్ తదితర ప్రాంత ప్రజలు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని నాణ్యతతో కూడిన తారు రోడ్డు వేయడంతో ప్రజలు హర్షిస్తున్నారు. పద్మావతి నగర్ లో పెండింగ్ లో ఉన్న సి.సి. రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం శ్రీనివాస్ నగర్ నుంచి సంజీవనగర్ గేట్ వరకు సి.సి. రోడ్డు నిర్మాణం సాగుతుంది. ఇటీవల సత్యనారాయణ పురంలో 40 లక్షలతో దేవాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇలా చెప్పుకుంటూ పోతే నంద్యాల, గోస్పాడు మండలాల్లో దేవాలయాలు, రోడ్లు, కాల్వలు తదితర వాటికి కోట్లలో నిధులు మంజూరు చేశారు. అభివృద్ధి జరగలేదు అని విమర్శలు చేసే నాయకులకు అభివృద్ధి తోనే నోళ్ళు ముంచడం మంత్రి ఫరూక్ కు వెన్నతో పెట్టిన విద్య అని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. త్వరలో ప్రత్యేక గ్రాంట్ ద్వారా మరో 100 కోట్ల నిధులతో నంద్యాల ,గోస్పాడు మండలాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. గతంలో డాక్టర్ బి.అర్. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు నేతలు ఇబ్బందులు పడేవారు, ప్రస్తుతం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో ఆయన విగ్రహాన్ని అంగరంగా వైభవంగా ఏర్పాటు చేసిన ఘనత ఒక్క ఫరూక్ కె దక్కుతుంది. ప్రస్తుత సమాజంలో ఇప్పుడు ఉన్న వేడికి యువత సైతం ఉదయం ఒక్క గంట బయట తిరగాలంటే ఇబ్బంది పడుతున్నారు. 75 ఏళ్ల వయసులో చలాకీగా విసుగుపడకుండా ఓపికతో నిదానంగా సబ్జెక్టు చెప్పడంలో ఆయనకు ఆయనే సాటి. 1983 లో రాజకీయాల్లోకి వచ్చి అంచెలంచెలుగా ఎదిగినా నటి నుంచి రాష్ట్రంలో ఎందరితో పరిచయాలు ఉండి అలనాటి విషయాలు గుర్తుపెట్టుకొని కొన్ని సమావేశాల్లో ఆయన కళ్లకు కట్టినట్టుగా చెప్పడం విశేషం. నంద్యాలలో హిట్ టాపిక్ ఏమి నడుస్తుందంటే నవయుగంలో నవయువకుడు మంత్రి ఫరూక్ అని ఆయనతో పోటీ పడాలంటే కష్టమే అని అనుకోవడం హాట్ టాపిక్ గా మారింది. నిజమే కదా రాష్ట్రం అంతా పర్యటిస్తూ నంద్యాలలో ఇన్ని కార్యక్రమాలు అలసట లేకుండా చేస్తున్న ఆయన నయా యువకుడే కదా సందేహం ఏమి లేదు అవును అని చెప్పాల్సిందే.

# ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనపరిచిన నలంద జూనియర్ కళాశాల విద్యార్థులు.

**-విద్యార్థులను అభినందించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 15:**
ఈ రోజు విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో నంద్యాలలోని నలంద జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులతో ప్రభంజనం సృష్టించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ, నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పాల్గొని, విద్యార్థులను మరియు కళాశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు.
ఈ సందర్భంగా మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల పట్టణానికి చెందిన నలంద జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి మార్కులు సాధించడం అభినందనీయని . కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించిన విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అన్నారు. కేవలం అకడమిక్ ఫలితాలే కాకుండా జేఈఈ మెయిన్స్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లోనూ ప్రతిభ చూపడం విద్యార్థుల పట్టుదలకు నిదర్శనం అన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తూ, నంద్యాల ప్రాంత కీర్తిని పెంచుతున్న నలంద కళాశాల యాజమాన్యాన్ని ఏబీఎల్ రెడ్డి మరియు రామ్మోహన్ రెడ్డి లను , కృషి చేసిన అధ్యాపక బృందాన్ని మరియు ప్రోత్సహించిన తల్లిదండ్రులను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను," అని తెలిపారు అనంతరం మంత్రి ఫరూక్ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాతో సత్కరించి, వారి భవిష్యత్తు మరిన్ని విజయాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నలంద కళాశాల డైరెక్టర్లు ఏ.బి.ఎల్. రెడ్డి , మరియు రామమోహన్ రెడ్డి గారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం జేఈఈ మెయిన్స్‌లో మా విద్యార్థులు 92% ఉత్తీర్ణత సాధించడం గర్వకారణం అన్నారు. విద్యార్థులకు ఇంటర్మీడియట్‌తో పాటు ఈఏపీసెట్, జేఈఈ మెయిన్స్, నీట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందిస్తున్నామని తెలిపారు . ప్రశాంతమైన వాతావరణం, విశాలమైన తరగతి గదులు మరియు బాలబాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి మా కళాశాల ప్రత్యేకత. "అద్భుతమైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారికి వెన్నుముకగా నిలిచిన తల్లిదండ్రులకు మరియు నిరంతరం శ్రమించిన అధ్యాపక బృందానికి కళాశాల యాజమాన్యం హృదయపూర్వక ధన్యవాదాలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. ఫలితాలు సాధించిన విద్యార్థులు సీనియర్ ఎంపీసీలో సునీత (988), ఎం. రంగ స్వాతి (984) మార్కులతో సత్తా చాటారని, సీనియర్ బైపీసీలో డి. షారుణ్ (982), యు. శృతి (981) ఉత్తమ మార్కులు సాధించారని. జూనియర్ ఎంపీసీలో గయ నరసింహుడు (465), సునంద (464), ఉమాదేవి (461), అజయ్ కుమార్ (461), ప్రవల్లిక (461), లక్ష్మీదేవి (460) మార్కులతో అగ్రస్థానంలో నిలిచారని జూనియర్ బైపీసీలో యామిని (444), రూబీనవి (441) మార్కులు సాధించారని . జూనియర్ సిఇసిలో విద్యార్థులు 450, 425 మార్కులతో రాణించారని తెలిపారు.

# 32 వ వార్డులో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 15:**
నంద్యాల పట్టణ పరిధిలోని 32 వ వార్డు (బొమ్మల సత్రం)లో భారీ ఎత్తున చేపట్టిన అభివృద్ధి పనులకు రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరై భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నంద్యాల పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమని తెలిపారు . 32 వ వార్డులో గత కొంతకాలంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, రూ. 2.5 కోట్లతో పటిష్టమైన సిమెంటు రోడ్లు మరియు డ్రైనేజీ వ్యవస్థను నిర్మిస్తున్నామని, అలాగే రాకపోకలకు ఇబ్బంది లేకుండా రూ. 32 లక్షలతో కల్వర్టును కూడా మంజూరు చేశామన్నారు. ఈ పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తి లేదని, అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని, కేవలం మాటలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పనులు చేసి చూపిస్తున్నామన్నారు. వార్డు ప్రజలు కూడా అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, 32వ వార్డు టిడిపి ఇంచార్జి కొండ శ్రీనివాస్ యాదవ్, బూతు ఇంచార్జ్ పోల్ రెడ్డి , మిద్దె ఉసేని, ప్రసాద్, సుబ్బయ్య, మహమ్మద్, రాజేంద్ర, రమణ, మరియు ఆర్ అండ్ బి, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్థానిక టీడీపీ నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# రైతుల భూములపై ఎన్ హెచ్ 167 కె కత్తి..!

## ..అలైన్‌మెంట్ మార్పు కోరిన కానాలరైతునగరం రైతులు..!

## ..అండగా నిలిచిన భూమా బ్రహ్మానంద రెడ్డి,టీడీపీ నాయకుల హామీ..!








**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 15:**
అభివృద్ధి పేరుతో చిన్న,సన్నకారు రైతులకు అన్యాయం జరుగుతోందంటూ ఎన్ హెచ్ 167కె (నంద్యాలజమ్మలమడుగు) రహదారి విస్తరణపై కానాల,రైతునగరం గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రతిపాదిత అలైన్‌మెంట్ కారణంగా విస్తారమైన సాగుభూములు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో రైతులు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు.

శంకర్రావు,శ్రీనివాసులు,రాచకొండ మురళీకృష్ణ శర్మ,టి.వెంకటేశ్వర్లు,టి.రామ చిన్నమ్మ,సీ.మద్దిలేటి, టి.వెంకటబాబు,గాజుల కరీం బాషా తదితరులు పాల్గొన్నారు.రైతుల ప్రకారం,గత ప్రభుత్వ హయాంలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లాభం చేకూరేలా నిబంధనలకు విరుద్ధంగా అలైన్‌మెంట్ రూపొందించారని ఆరోపించారు.

ప్రస్తుతం ఉన్న పాత రహదారిని అనుసరించి విస్తరణ చేపడితే భూముల నష్టం గణనీయంగా తగ్గుతుందని సూచించారు.రైతుల గోడును విన్న భూమా బ్రహ్మానంద రెడ్డి స్పందిస్తూ,అలైన్‌మెంట్‌లో లోపాలు ఉంటే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని,అవసరమైతే ప్రణాళికలో మార్పులు చేయించేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు."రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది.

చిన్న రైతుల భూములు నష్టపోయే విధంగా ప్రణాళికలు ఉండకూడదు" అని పేర్కొన్నారు.

ఇక ఇదే సమస్యపై గతంలో కానాల ప్రాంత రైతులు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కు వినతిపత్రం సమర్పించిన విషయం గుర్తుచేశారు. అప్పట్లో తమ సమస్యలను వివరించి అలైన్‌మెంట్ మార్పు,సరైన పరిహారం కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఇటీవల భూసేకరణ,పరిహారం అంశాలపై రైతుల ఆందోళనలు మరింత ఉధృతమవుతున్న నేపథ్యంలో టీడీపీ నాయకులు కూడా గ్రామాలను సందర్శించి బాధితులకు అండగా నిలిచారు.భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వారు గతంలో హామీ ఇచ్చారు.భూసేకరణలో పారదర్శకత లేకపోవడం,తగిన పరిహారం అందకపోవడం వంటి అంశాలపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి అలైన్‌మెంట్ పునఃసమీక్షించి రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 2026 ఇంటర్ ఫలితాలలో రావుస్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 15:**
నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జూనియర్ మరియు సీనియర్ ఇంటర్ ఫలితాలలో ఒకరికి ఇద్దరికి కాదు నంద్యాల జిల్లాలో అత్యధిక సంఖ్యలో అన్ని గ్రూపులలో స్టేట్ ర్యాంకులు రావుస్ కళాశాల విద్యార్థులు సాధించారు.సీనియర్ ఎంపీసీ విభాగములో ఎస్. అయేషా 987, ఎస్. ఖలిమా 987, సి. సుధాకర్ 986, పి. మాధుర్య 986 మార్కులతో పాటు 980 పైన మార్కులు నంద్యాలలో అత్యధికంగా 22 మంది సాధించారు.సీనియర్ బైపిసి లో పి. జ్యోత్స్న 986, ఎస్. మాటు హుసేన్ 986 మార్కులు సాధించారు. సీనియర్ బైపిసి లో 980 పైన మార్కులు నంద్యాలలో అత్యధికంగా 6 మంది సాధించారు.సీనియర్ సిఇసి విభాగములో ఎం.కె. అజ్మీ 971, కె. ఇందర్ 969, జి. వాణి 964 మార్కులతో టాపర్ గా నిలిచారు.సీనియర్ ఇంటర్ లో 1000 కి 980 పైన నంద్యాల జిల్లాలో అత్యధికంగా 28 మంది మరియు 90% పైన మార్కులు రికార్డు స్థాయిలో 220 మంది సాధించారు.జూనియర్ ఎంపీసీలో ఎస్. నందితాశ్రీ 470కి 466 మార్కులు ఎం .అహ్మది 465 మార్కులతో పాటు 460 పైన నంద్యాలలో అత్యధికంగా



16 మంది, 450 పైన రికార్డు స్థాయిలో 63 మంది సాధించారు.

జూనియర్ బైపిసిలో 455 , పి. కావ్య 448, బి. నీరజ 446, ఎన్.వి. నాగ హారిక 446 మార్కులతో పాటు 440 పైన నంద్యాలలో అత్యధికంగా 14 మంది సాధించారు.జూనియర్ సీఈసీ లో పి. స్వాతి 486, ఎస్. తహసీమ్ 484 మార్కులతో టాపర్స్ గా నిలిచారు.

ఎంఈ సి లో ఎమ్. లోహిత 485 మార్కులతో టాపర్ గా నిలిచింది. జునియర్ ఇంటర్ లో 400 పైన మార్కులు నంద్యాలలో అత్యధికంగా 311 మంది సాధించి రికార్డు సృష్టించారు.ఈ విద్యా సంవత్సరం నుండి పద్మావతి నగర్ (శ్రీకృష్ణ టెంపుల్ దగ్గర) అత్యాధునిక సదుపాయాలతో నూతన జేఈఈ నీట్ క్యాంపస్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విశాలమైన తరగతి గదులు, డిజిటల్ బోర్డ్స్., అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జేఈఈ విద్యార్థులకు ఆన్లైన్ నందు పరీక్షలు రాసే విధంగా కంప్యూటర్ ల్యాబ్ ని ఏర్పాటు చేసియున్నారు. అంతే కాకుండా ఈ విద్యా సంవత్సరం నుండి శ్రీ చైతన్య విద్యాసంస్థల వారి ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ క్వశ్చన్ పేపర్ జేఈఈ నీట్ విద్యార్థులకు జాతీయ స్థాయి అధ్యాపక బృందంచే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులను, అధ్యపక వర్గాన్ని కళాశాల చైర్మన్ శ్రీ ఏ ఎం బి అప్పారావు మరియు డైరెక్టర్ ఏ. మోని చంద్ర అభినందించారు.

సీనియర్ ఇంటర్ ఫలితాలు980 (98%) కంటి ఎక్కువగా 28 మంది నంద్యాల లో అత్యధికంగా,970 (97%) కంటే ఎక్కువగా 64 మంది నంద్యాల లో అత్యధికంగా,900 (90%) కంటే ఎక్కువగా 220 మంది నంద్యాల లో అత్యధికంగా అద్భుతమైన ఫలితాలు వచ్చాయి అని తెలిపారు.

# జిల్లాలో మరో 4 అన్న క్యాంటీన్ల ప్రారంభం.

- ప్రజలకు రూ.5కే నాణ్యమైన భోజనం.

..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం

పాణ్యం నియోజకవర్గంలో మూడో అన్న క్యాంటీన్ ప్రారంభం.

..పాణ్యం ఎమ్మెల్యే గౌరీ చరితా రెడ్డి.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 15:**
జిల్లాలో మరో 4 అన్న క్యాంటీన్ల ను ప్రారంభించడం జరిగిందని, ప్రజలకు రూ.5కే నాణ్యమైన భోజనం అందించడం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు.బుధవారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండల పరిధిలోని నంద్యాల చెక్ పోస్ట్ సమీపంలో ప్రజా ఆరోగ్య, పురపాలక సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో రూ. 61.00 లక్షలతో నిర్మించిన నూతన అన్న క్యాంటీన్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కలసి అన్న క్యాంటీన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే ప్రజలకు భోజనం వడ్డించి, అన్న క్యాంటీన్ లో భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో పేద ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన ఆహారం అందించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన అన్న క్యాంటీన్ లు విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. ఈ రోజు జిల్లాలో మరో 4 అన్న క్యాంటీన్లు ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో 11 అన్న క్యాంటీన్లు పనిచేస్తున్నాయన్నారు. అన్న క్యాంటీన్ ల ద్వారా ప్రజలకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఒక్కో భోజనానికి సుమారు రూ.34 లు, టిఫిన్‌కు రూ.22 లు ఖర్చు అవుతుండగా, ప్రభుత్వం ఈ ఖర్చును భరిస్తూ ప్రజలకు కేవలం రూ.5కే అందిస్తున్నదని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే పనిచేస్తున్న అన్న క్యాంటీన్లను స్వయంగా సందర్శించి, భోజన నాణ్యత, సేవలపై ప్రజల అభిప్రాయాలను సేకరించినట్లు కలెక్టర్ తెలిపారు. అందరూ సేవలపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. ప్రస్తుత కాలంలో రూ.5కు టీ కూడా దొరకని పరిస్థితుల్లో అన్న క్యాంటీన్ల ద్వారా అన్నం, పప్పు, సాంబార్, పెరుగు, పచ్చడి వంటి ఐదు రకాల వంటకాలను అందించడం బాగుందని ప్రజలు స్పందిస్తున్నారన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణలో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పరంగా కర్నూలు జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని కలెక్టర్ తెలిపారు. ప్రతి అన్న క్యాంటీన్‌లో రోజుకు ఉదయం టిఫిన్‌కు 300 నుండి 400 మంది, మధ్యాహ్నం భోజనానికి 400 నుండి 500 మంది, రాత్రి భోజనానికి సుమారు 500 మంది వరకు ప్రజలు భోజనం చేస్తున్నారని వివరించారు. ఈ రోజు ప్రారంభించిన కొత్త 4 అన్న క్యాంటీన్ల ద్వారా మరింత మందికి ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

### పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం.


**పాణ్యం నియోజకవర్గంలో మూడో అన్న క్యాంటీన్ ప్రారంభం.**

**పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి.**

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి తెలిపారు. పాణ్యం నియోజకవర్గంలో ఇప్పటికే రెండు అన్న క్యాంటీన్లు పనిచేస్తుండగా, తాజాగా ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్‌తో మొత్తం మూడు క్యాంటీన్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన రోజునే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు తొలి సంతకం.చేశారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం కాలంలో అన్న క్యాంటీన్లు మూసివేయబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణతో పాటు విస్తరణకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. 2024 ఆగస్టు 15న తొలి దశలో 100 అన్న క్యాంటీన్లు, సెప్టెంబర్ 19న మరో 75 క్యాంటీన్లు ప్రారంభించగా, అనంతరం దశలవారీగా మొత్తం 204 క్యాంటీన్లు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాజాగా ప్రారంభించిన 62 క్యాంటీన్లతో కలిపి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 266 అన్న క్యాంటీన్లు ప్రజలకు సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సుమారు 2 లక్షల 10 వేల మంది అన్న క్యాంటీన్లలో భోజనం చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 8 కోట్ల 80 లక్షల మందికి భోజనం అందించినట్లు వివరించారు. ప్రతి క్యాంటీన్‌లో సగటున 500 మంది భోజనం చేస్తున్నారని తెలిపారు. నంద్యాల చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన ఈ అన్న క్యాంటీన్ ఓర్వకల్లు, నందికొట్కూరు ప్రాంతాలకు కేంద్రంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామస్థాయికి అన్న క్యాంటీన్ సేవలను విస్తరించడం హర్షణీయమని, పేదల ఆకలి తీర్చే దిశగా ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే వెల్లడించారు. పాణ్యం నియోజకవర్గంలో అన్న క్యాంటీన్ల ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎస్.ఈ రమణమూర్తి, మున్సిపల్ ప్రజా ఆరోగ్య విభాగపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుర్రప్ప యాదవ్, డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఇంజనీర్ నాగ శేషారావు, జనసేన అధ్యక్షులు సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వైఎస్ఆర్సిపి యువజన ప్రధాన కార్యదర్శిగా సద్దల చంద్రశేఖర్ రెడ్డి ని ఎంపిక చేసిన వైయస్ జగన్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 15:**
నంద్యాల జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా సద్దల చంద్రశేఖర్ రెడ్డి నియమించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ పదవి నాకు దక్కడం అదృష్టంగా భావిస్తూ పదవి నాకు ఇచ్చినటువంటి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి మరియు జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. అలాగే నంద్యాల జిల్లా మరియు కర్నూలు జిల్లా యువజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి మరియు శివకుమార్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఈ పదవిని అలంకరణ ప్రాయంగా కాకుండా నా వంతుగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేయడమైనది.

## సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ధన్యవాదములు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 15:**
తెలుగుదేశం పార్టీ బుధవారం అధికారికంగా ప్రకటించిన పార్టీ పదవుల్లో తనకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సేవ చేసే అవకాశాన్ని కల్పించినందుకు తెలుగుదేశం పార్టీ కి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నాననీ, ఈ బాధ్యతను నాపై నమ్మకంతో అప్పగించిన టీడీపీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు, అలాగే జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులైన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. టీడీపీ బలోపేతం కోసం, ప్రజల సేవ కోసం పూర్తి నిబద్ధతతో, కృషితో ముందుకు సాగుతానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

## టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన బైరెడ్డి శబరి.

### ..కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న నాలుగో వార్డు ప్రజలు.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 15:**నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన సందర్భంగా నంద్యాల పట్టణంలోని నాలుగో వార్డులో టిడిపి మహిళా నాయకురాలు షేక్ వాహిదా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ డి. రంగ ప్రసాద్, ఏ కోడూరుకు చెందిన టిడిపి నాయకులు వి. సంజీవరెడ్డి, నంద్యాల బ్లడ్ అచ్చు, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యులు ఉస్మాన్ బాషా, టిడిపి నాయకులు ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బైరెడ్డి శబరి పిఎ రాజేష్ నాయుడు మృతికి ఒక నిమిషం పాటు సంతాపం తెలిపారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ కి టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఈ పదవులు ఎంతగానో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. అలాగే 15 సూత్రాల పథకం కమిటీ సభ్యునిగా ఎంపికైన రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ భాషాకు ఈ సందర్భంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డీజీబుల్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్, స్థానిక టీడీపీ నాయకులు షఫీవుల్లా, వలి భాష, కలాం, చిన్న ఖాదర్బాష, మహబూబ్ భాష, నాగరాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన కస్తూర్బా పాఠశాల విద్యార్థిని.

### - 963 మార్కులు సాధించిన జి.మధులత.




**ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల ఏప్రిల్ 15:**
శిరివెళ్ళ మండలంలో విద్యార్థిని ప్రతిభ ప్రతిభావంతంగా వెలుగొందింది.

ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో 963 మార్కులు సాధించి గుర్రాల మధులత టాప్ ర్యాంక్ సాధించింది.శిరివెళ్ళ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న మధులత ఈ ప్రతిభను కనబరిచింది. సాధారణ కుటుంబానికి చెందిన ఈ విద్యార్థిని తన కృషి , పట్టుదలతో ఉన్నత ఫలితాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచింది.మజరా గ్రామమైన ఖాదర బాదరా గ్రామానికి చెందిన బ్రహ్మయ్య కుమార్తె అయిన మధులత చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ చూపుతూ వస్తోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం , ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో నిరంతరం కృషి చేసి ఈ విజయం సాధించినట్లు మధులత తెలిపారు.మధులత సాధించిన ఈ విజయం పాఠశాలకు , గ్రామానికి గర్వకారణమైంది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు , గ్రామ పెద్దలు , స్థానిక ప్రజాప్రతినిధులు మధులతను అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.ఇలాంటి గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కష్టపడి ఉన్నత ఫలితాలు సాధించడం ద్వారా ఇతరులకు ప్రేరణగా నిలుస్తున్నారని విద్యావేత్తలు పేర్కొన్నారు.